వన్నె తగ్గిన బంగారం

ఒక్కరోజే రూ.1,470 దిగిన 10 గ్రాముల ధర

హైదరాబాద్/న్యూఢిల్లీ, జూన్ 24: దేశీయ మార్కెట్‌లో బంగారం ధరలు భారీగా పడిపోయాయి. మంగళవారం హైదరాబాద్‌లో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల రేటు రూ.1,470 దిగి లక్ష రూపాయల మార్కుకు దిగువన రూ.99,220 వద్ద స్థిరపడింది. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) తులం విలువ కూడా రూ.1,350 దిగొచ్చి రూ.90,950 వద్ద నిలిచింది. కాగా, దేశ రాజధాని న్యూఢిల్లీలో 24 క్యారెట్ తులం రేటు రూ.900 తగ్గి రూ.98,900గా నమోదైనట్టు అఖిల భారత సరఫా అసోసియేషన్ తెలియజేసింది.

ఉద్రిక్తతలు తగ్గడంతో..

పశ్చిమాసియానేగాక, యావత్తు ప్రపంచాన్ని ఆందోళనకు గురిచేస్తున్న ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం వల్లే గోల్డ్ మార్కెట్‌లో ఈ రివర్స్ ట్రెండ్ అని నిపుణులు తాజా మార్కెట్ సరళిని విశ్లేషిస్తున్నారు. గతకొద్ది రోజులుగా ఇరాన్-ఇజ్రాయెల్ దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న విషయం తెలిసిందే. పరస్పర దాడులతో బీభత్సం సృష్టించాయి. ఈ ఘర్షణల్లోకి అమెరికా కూడా ప్రవేశించడంతో పరిస్థితులు మరింతగా దిగజారాయి. ఈ క్రమంలో స్టాక్ మార్కెట్లలో వాటిల్లుతున్న నష్టాలను అధిగమించడానికి మదుపరులు సురక్షిత పెట్టుబడి సాధనమైన బంగారం వైపునకు అడుగులు వేస్తూ వచ్చారు. అయితే ఇరాన్-ఇజ్రాయెల్‌లు కాల్పుల విరమణకు అంగీకరించాయన్న వార్తలు.. ఇన్వెస్టర్ల చూపును మళ్లీ ఈక్విటీల వైపునకు మరల్చాయి. ఈ నేపథ్యంలోనే బంగారం ధరల తగ్గుదల అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

వెలవెలబోతున్న వెండి

మార్కెట్‌లో బంగారం ధరలతోపాటు వెండి ధరలూ క్షీణిస్తున్నాయి. న్యూఢిల్లీలో కిలో రేటు ఈ ఒక్కరోజే రూ.1,000 పతనమైంది. దీంతో రూ.1,04,200 వద్ద స్థిరపడింది. సాధారణ కొనుగోలుదారులతోపాటు నాణేల తయారీదారులు, వ్యాపార, పారిశ్రామిక వర్గాల నుంచి డిమాండ్ తగ్గిందని.. అందుకే వెండి ధరలు క్రమేణా దిగొస్తున్నాయని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా, ఈ నెలలోనే వెండి కిలో ధర మునుపెన్నడూ లేనివిధంగా ఆల్‌టైమ్ హై రికార్డును సృష్టిస్తూ రూ.1,08,100గా నమోదైన సంగతి విదితమే. అయితే గడిచిన రెండు వారాల్లో కిలో రేటు దాదాపు రూ.4వేలదాకా పడిపోయింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో తులం 24 క్యారెట్ బంగారం ధర దేశీయంగా గరిష్ఠంగా రూ.1,01,600 పలికిన సంగతీ విదితమే.

గ్లోబల్ మార్కెట్‌లో..

అంతర్జాతీయ మార్కెట్‌లోనూ గోల్డ్, సిల్వర్ రేట్లు క్రమేణా క్షీణిస్తున్నాయి. ఔన్స్ గోల్డ్ ధర 46.05 డాలర్లు లేదా 1.37 శాతం పడిపోయి 3,323.05 డాలర్లకు పరిమితమైంది. అమెరికా రిజర్వ్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ద్రవ్యవిధానాన్ని ఇన్వెస్టర్లు దగ్గరగా గమనిస్తున్నారని, ఈ క్రమంలోనే గోల్డ్ మార్కెట్ రివర్స్ గేర్ తీసుకుందన్న అంచనాలు వినిపిస్తున్నాయిప్పుడు. వడ్డీరేట్లను తగ్గించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎప్పట్నుంచో చెప్తున్నప్పటికీ ఫెడ్ రిజర్వ్ చైర్మన్ జెరోమీ పావెల్ ససేమిరా అంటున్నారు. వడ్డీరేట్ల కోతలపై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని తాజాగా మరోసారి స్పష్టం చేశారు. దీంతో గ్లోబల్ మార్కెట్‌లో బంగారం ధరల క్షీణతకు దారితీసింది. దేశ ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులపై వేచిచూసే ధోరణినే అవలంబిస్తున్నామన్నారు. సాధారణంగా ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్లు తగ్గితే బంగారం ధరలు మార్కెట్‌లో పెరుగుతాయి. అలాగే వడ్డీరేట్లు పెరిగితే గోల్డ్ ప్రైస్ తగ్గుతుంది.

Sangeetha.com PIONEER THEN, LEADER NOW.

సంగీత వార్షికోత్సవ ఆఫర్లు

షాప్‌లో అడుగుపెట్టిన ప్రతీ కస్టమర్‌కు రూ.5,001

హైదరాబాద్, జూన్ 24: సంగీత మొబైల్స్ 51వ వసంతంలోకి అడుగుపెట్టింది. ఈ సందర్భంగా కొనుగోలుదారులపై ఆఫర్ల వర్షం కురిపించింది. దేశవ్యాప్తంగా కంపెనీకి ఉన్న రిటైల్ అవుట్‌లెట్లను సందర్శించిన ప్రతీ కస్టమర్‌కు రూ.5,001 చొప్పున ఎలక్ట్రానిక్ మనీని ట్రాన్స్‌ఫర్ చేయనున్నారు. కంపెనీ అవుట్‌లెట్లలో కొనుగోలు చేసే ప్రతీ వస్తువుపై 5 శాతం వరకు ఈ మనీని బదలాయించుకోవచ్చునని, దీనిని డిసెంబర్ 31 వరకు వినియోగించుకోవచ్చునని కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సుభాష్ చంద్ర తెలిపారు. ఈ నెల మొదట్లో ప్రారంభమైన ఈ ప్రత్యేక ఆఫర్లు వచ్చే నెల 6 వరకు కొనసాగనున్నాయని చెప్పారు. వీటితోపాటు టీవీలు, వాషింగ్‌మిషన్లు, వాక్యూమ్ కూలర్లపై 10 శాతం తగ్గింపు ధరకే అందిస్తున్నది. ప్రతీయేటా 10-15 శాతం వృద్ధిని సాధిస్తున్నట్టు, గడిచిన ఏడాది రూ.3 వేల కోట్లుగా నమోదైన టర్నోవర్, ఈ సారి రూ.3,500 కోట్లకు చేరుకుంటున్నదని ఆశిస్తున్నట్టు చెప్పారు.

సంగీత మొబైల్స్ ఆఫర్ల వివరాలు

- *ప్రతీ స్మార్ట్‌ఫోన్‌పై రూ.10 వేల వరకు క్యాష్‌బ్యాక్*
- *ఎంపిక చేసిన స్మార్ట్‌ఫోన్లపై 50 శాతం తగ్గింపు ధరకే విక్రయిస్తున్నది.*
- *ప్రతీ ఫోన్ కొనుగోలుపై 24 నెలల డ్యామేజ్ ప్రొటెక్షన్*
- *నీటిలోపడ్డ, పగిలిపోయిన ఫోన్లకు కొత్త ఫోన్ కొనుగోలుపై 70 శాతం వరకు రాయితీ*
- *ఎస్బీఐ క్రెడిట్ కార్డుతో కొనుగోళ్లపై 5 శాతం ఇన్‌స్టంట్ డిస్కౌంట్*
- *బజాజ్ ఫైనాన్స్, టీవీఎస్ క్రెడిట్, హెచ్‌డీబీ, ఐడీఎఫ్‌సీ కార్డులతో కొనుగోళ్లపై రూ.5 వేల వరకు రాయితీ*

చమురు ధరల్లో పతనం

న్యూఢిల్లీ, జూన్ 24: ముడి చమురు ధరలు దాదాపు 5 శాతం పడిపోయి మంగళవారం 2 వారాల కనిష్ఠాన్ని తాకాయి. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య జరిగిన కాల్పుల విరమణతో మిడిల్ ఈస్ట్‌లో చమురు సరఫరాకు నెలకొన్న అడ్డంకులు తొలగుతాయన్న అంచనాలే ఇందుకు కారణం. ఈ క్రమంలోనే బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ మార్కెట్‌లో బ్యారెల్ ధర 6 శాతం తగ్గి 66.65 డాలర్లుగా నమోదైంది. అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియేట్ (డబ్ల్యూటీఐ)లోనూ బ్యారెల్ క్రూడాయిల్ రేటు 65.31 డాలర్లుగా ఉన్నది. ఈ నెల 10 తర్వాత ఈ స్థాయిలో ధరలు పలకడం ఇదే తొలిసారి. అయితే ఇరాన్, ఇజ్రాయెల్ దేశాలు కాల్పుల విరమణను ప్రకటించిన గంటల వ్యవధిలోనే దాన్ని ఉల్లంఘించాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన మార్కెట్‌లో మళ్లీ ప్రకంపనల్ని సృష్టిస్తున్నది.

జెన్ చేతికి టిసా ఏరోస్పేస్

హైదరాబాద్, జూన్ 24: హైదరాబాద్‌కు చెందిన యాంటీ-డ్రోన్ టెక్నాలజీ సేవల సంస్థ జెన్ టెక్నాలజీస్..డిఫెన్స్ రంగంలోవున్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి మరో సంస్థను కొనుగోలు చేయడానికి సిద్ధమైంది. ఇందుకోసం టిసా ఏరోస్పేస్‌లో మెజార్టీ వాటా 54.7 శాతం వాటాను కొనుగోలు చేసింది. ఒప్పంద విలువ రూ.6.66 కోట్లుగా ఉన్నది.

సాఫ్రాన్ ఫైటర్ జెట్ సెంటర్

హైదరాబాద్, జూన్ 24(నమస్తే తెలంగాణ): ఫ్రెంచ్‌కు చెందిన విమాన ఇంజిన్ల తయారీ సంస్థ సాఫ్రాన్ రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చింది. ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌లో వందేండ్లకుపైగా చరిత్ర ఉన్న సాఫ్రాన్.. హైదరాబాద్‌లో ఇప్పటికే రెండు ప్రపంచస్థాయి ఉత్పాదక కేంద్రాలను ఏర్పాటు చేసింది. తాజాగా మంగళవారం సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో సాఫ్రాన్ జనరల్ మేనేజర్ పియరీ ఫెర్నాండెజ్ కొత్త పెట్టుబడులను ప్రతిపాదించారు. నూతనంగా ఎయిర్ క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసెస్ కేంద్రాన్ని నెలకొల్పబోతున్నట్టు ఆయన ప్రకటించారు. రఫేల్, ఎం 88 ఫైటర్ జెట్ ఇంజిన్ల నిర్వహణ, ఓవర్ హాలింగ్ పనులు ఇక్కడే నిర్వహించడానికి వీలు పడనున్నదన్నారు. తద్వారా వచ్చే ఏడాది చివరి నాటికి కొత్తగా 150 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని, అనంతరం దశలవారీగా మరో 750 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నట్టు వెల్లడించారు. ప్రస్తుతం రఫేల్ యుద్ధ విమానాల ఇంజిన్లకు కీలక విడి భాగాలను తయారు చేస్తున్న సాఫ్రాన్ .. ఇక్కడి నుంచే ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నది కూడా. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. భావితరాల అవసరాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించబోతున్న ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టేలా ఫ్రెంచ్ కంపెనీలను ప్రోత్సహించాలని ఇఫ్కీ ప్రతినిధులను కోరారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి అనుకూలతలు, అందిస్తున్న ప్రోత్సాహకాలను ఈ సందర్భంగా ఆయన వివరించారు. 'తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేయాలనే దూరదృష్టితోనే సీఎం రేవంత్ రెడ్డి 30 వేల ఎకరాల్లో పీపీపీ విధానంలో ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి శ్రీకారం చుట్టారని, అంతర్జాతీయ భాగస్వామ్యంతో ఈ నగరాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలన్నదే తమ సంకల్పమన్నారు.

డార్విన్‌బాక్స్ బైబ్యాక్ పూర్తి

న్యూఢిల్లీ, జూన్ 24: మానవ వనరుల స్టార్టప్ డార్విన్‌బాక్స్..మూడోసారి ఎంప్లాయి స్టాక్ ఓనర్‌షిప్ ప్లాన్ బైబ్యాక్‌ను రూ.86 కోట్లతో పూర్తి చేసింది. ఈ బైబ్యాక్‌తో 350 మంది ఉద్యోగులకు ప్రయోజనాలు లభించాయని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలనే ఉద్దేశంతో గడిచిన నాలుగేండ్లలో మూడుసార్లు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. ప్రస్తుతం సంస్థకు భారత్‌తోపాటు ఉత్తర అమెరికా, దక్షిణాసియా, మధ్య తూర్పు దేశాల్లో 11 కార్యాలయాలు ఉన్నాయి.

హైదరాబాద్‌లో టీసీఎస్‌కు మరో ఆఫీస్

tcs TATA CONSULTANCY SERVICES

హైదరాబాద్, జూన్ 24: ప్రముఖ టెక్నాలజీ దిగ్గజం టీసీఎస్ వ్యాపార విస్తరణలో భాగంగా రూ.4,500 కోట్ల మేర పెట్టుబడులు పెడుతున్నది. ఈ నిధులతో బెంగళూరుతోపాటు కోల్‌కతా, కొచ్చి, హైదరాబాద్, కోయంబత్తూరు, వైజాగ్‌లలో నూతన క్యాంపస్‌లు, ఆఫీస్ స్థలాలను లీజుకు తీసుకోనున్నట్టు ప్రకటించింది. సంస్థలో 6 లక్షల మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు.

పెరిగిన విమాన ప్రయాణికులు

ముంబై, జూన్ 24: దేశీయంగా విమానాల్లో ప్రయాణించేవారి సంఖ్య అంతకంతకు పెరుగుతున్నది. మే నెలలో 140.56 లక్షల మంది దేశీయంగా ప్రయాణించారని డీజీసీ తాజాగా వెల్లడించింది. క్రితం ఏడాది ప్రయాణించిన 137.96 లక్షల మందితో పోలిస్తే 1.89 శాతం పెరిగారని తెలిపింది. వీరిలో ఇండిగో విమానాల్లో 93 లక్షల మంది ప్రయాణించగా, ఎయిర్ ఇండియాలో 37.22 లక్షల మంది, ఆకాశ ఎయిర్‌లో 7.48 లక్షలు, స్పైస్ జెట్‌లో 3.40 లక్షల మంది ప్రయాణించారు.

ఇండిగో మాన్‌సూన్ ఆఫర్

- **రూ.1,499కే విమాన టికెట్**

న్యూఢిల్లీ, జూన్ 24: ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో..విమాన ప్రయాణికులను ఆకట్టుకోవడానికి ప్రత్యేక ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 'మాన్‌సూన్ సేల్' పేరుతో దేశీయ, అంతర్జాతీయ రూట్లలో విమాన టికెట్లను తగ్గింపు ధరకే విక్రయిస్తున్నది. ఈ నెల 29 వరకు బుకింగ్ చేసుకున్న ప్రయాణికులు జూలై 1 నుంచి సెప్టెంబర్ 21లోపు ఎప్పుడైనా ప్రయాణించాల్సి ఉంటుందని కంపెనీ వెల్లడించింది. ఈ ఆఫర్ కింద ఒకవైపు దేశీయ ప్రారంభ విమాన టికెట్ ధర రూ.1,499గాను, అంతర్జాతీయ రూట్‌లో రూ.4,399గా నిర్ణయించింది. అలాగే బిజినెస్ క్లాస్ టికెట్ రూ. 9,999 ప్రారంభ ధరతో అందిస్తున్నది సంస్థ. దీంతోపాటు ప్రీ-పెయిడ్ బ్యాగేజీ చార్జీలపై కూడా 50 శాతం రాయితీ ఇస్తున్నది.

దేశంలో 30కోట్ల 5జీ కస్టమర్లు

స్మార్ట్‌ఫోన్లలో రోజుకు 1జీబీకిపైగానే డాటా వినియోగం

ఎరిక్సన్ మొబిలిటీ రిపోర్ట్‌లో వెల్లడి

న్యూఢిల్లీ, జూన్ 24: గత ఏడాది చివరి నాటికి దేశంలో 5జీ వినియోగదారులు 29 కోట్లకు చేరారని మంగళవారం విడుదలైన ఎరిక్సన్ మొబిలిటీ రిపోర్టులో తేలింది. మొత్తం భారతీయ మొబైల్ వినియోగదారుల్లో ఇది 24 శాతమని పేర్కొన్నది. అలాగే ఒక్కో స్మార్ట్‌ఫోన్ యూజర్ నెలకు 32 జీబీ డాటాను వాడుకున్నారని ఈ తాజా నివేదికలో ఎరిక్సన్ స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే 2030కల్లా ఇంచుమించుగా మూడురెట్లు పెరిగి దేశీయ 5జీ సబ్‌స్క్రైబర్లు దాదాపు 98 కోట్లకు చేరుకోవచ్చని (దేశీయ మొబైల్ వాడకందారుల్లో 75 శాతం), నెలకు స్మార్ట్‌ఫోన్ వినియోగదారుల డాటా వాడకం 62 జీబీని తాకవచ్చని అంచనా వేసింది. ఇక 2030 నాటికి దేశంలో 4జీ కస్టమర్లు ప్రస్తుతంతో పోల్చితే సుమారు 60 శాతం పడిపోయి 23 కోట్లకు పరిమితం కావచ్చంటూ ఈ అప్‌డేటెడ్ రిపోర్టులో స్వీడిష్ టెలికం కంపెనీ చెప్పింది. నిరుడు నవంబర్‌లో విడుదల చేసిన రిపోర్టులో 2030 నాటికి దేశంలో 5జీ యూజర్లు 97 కోట్లకు పెరగవచ్చని, 4జీ కస్టమర్లు 24 కోట్లుగా ఉంటారని అంచనా వేసింది. నెలవారీ డాటా వినియోగం కూడా స్మార్ట్‌ఫోన్‌కు 66 జీబీగా ఉండొచ్చన్నది. అయితే తాజా నివేదికలో ఈ నెంబర్లను సవరించింది.

ఎమర్జెన్సీకి 50 ఏండ్లు

భారత ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి అధ్యాయం ▪ ప్రజల హక్కులను కాలరాసిన ఇందిర సర్కారు

1974లో పాట్నాలో జయప్రకాశ్ నారాయణ్‌ను చుట్టుముట్టిన పోలీసులు

న్యూఢిల్లీ, జూన్ 24: 1975 జూన్ 25.. దేశంలో నాటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ విధించిన 21 నెలల అత్యాయిత పరిస్థితి ప్రారంభమైన రోజు. సరిగ్గా నేటికి 50 సంవత్సరాల క్రితం మొదలైన ఆ చీకటి అధ్యాయం నేటికీ స్వతంత్ర భారతాన్ని వెంటాడుతూనే ఉంది. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ ఇందిరా గాంధీ హయాంలో ఓ 21 నెలల పాటు అంధయుగాన్ని చవిచూసింది. ప్రసార మాధ్యమాల గొంతు నొక్కడంతోపాటు రాజకీయ ప్రత్యర్థులను, పాత్రికేయులను జైళ్లలో కుక్కిన పాడుకాలమది. తమ హక్కులకు భంగం వాటిల్లితే న్యాయస్థానాలను ఆశ్రయించే స్వేచ్ఛ పౌరులకు లేకుండా హరించి వేసిన చీకటి రోజులవి. ఇందిర తనయుడు సంజయ్ గాంధీ దుందుడుకు చర్యలతో పెట్రేగిపోయి అమలుచేసిన నిర్బంధ కుటుంబ నియంత్రణ దేశవ్యాప్తంగా కలకలం రేపింది. పేద కుటుంబాల వారిని ఇళ్లలోంచి బయటకు లాగి మరీ కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశారు. అవి వికటించి కొందరు అసువులు బాశారు. ఎమర్జెన్సీ కాలంలో ఇందిర నిరంకుశ పాలన దేశ ప్రజలలో భయోత్పాతాన్ని సృష్టించింది.

ఎమర్జెన్సీలో జార్జి ఫెర్నాండెజ్ అరెస్ట్

చెరిగిపోని చేదు జ్ఞాపకాలు

" దేశంలో రాష్ట్రపతి ఎమర్జెన్సీ విధించారు. భయపడాల్సిన పని లేదు" అని ఇందిరా గాంధీ అదే రోజున ఆల్ ఇండియా రేడియోలో చెప్పిన మాట. ఆమె మాటలు భారత ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేశాయి. అదే సమయంలో భారత దేశ ప్రజాస్వామిక చరిత్రలో చెరిగిపోని చేదు జ్ఞాపకాలకు కూడా అప్పుడే అంకురార్పణ జరిగింది. నాటి ప్రధాని ఇందిరా గాంధీ సూచన మేరకు ఆనాటి రాష్ట్రపతి ఫఖ్రుద్దీన్ అలీ అహ్మద్ రాజ్యాంగంలోని 352 అధికరణ కింద దేశవ్యాప్తంగా అత్యాయిక స్థితిని విధించారు. ఆ స్థితి 1977 మార్చి 21 వరకు 21 నెలలపాటు కొనసాగింది. ఎమర్జెన్సీ కాలంలో జరిగిన ఘోరాలు, రాజ్యాంగ ఉల్లంఘనలు, ప్రజాస్వామిక విలువల పాతరను పురస్కరించుకుని జూన్ 25వ తేదీని "రాజ్యాంగ హత్య దినం"(సంవిధాన్ హత్య దివస్)గా పాటించాలని ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని భారత ప్రభుత్వం నిర్ణయించింది. దేశ పౌరులు తమ హక్కులు కోల్పోయారు. రాజకీయ నాయకులు, నిరసనకారులు జైలు పాలయ్యారు. పత్రికా స్వేచ్ఛ కనుమరుగైంది. ఒకే వ్యక్తి చేతిలో అధికారం బందీ అయింది. ఆ వ్యక్తే ఇందిరా గాంధీ. ఆమె ఇష్టానుసారం నిబంధనలు మారిపోయాయి. దేశవ్యాప్తంగా నిరసనలు మిన్నంటాయి. జయప్రకాశ్ నారాయణ్, మొరార్జీ దేశాయ్, అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్‌కే అద్వానీ, మధు దండావతె, జార్జి ఫెర్నాండెజ్ వంటి రాజకీయ ప్రముఖులు జైలు పాలయ్యారు.

1974లో అహ్మదాబాద్‌లో విద్యార్థుల భారీ నిరసన ప్రదర్శన

భారతంలో చీకటి కాలం

ఎమర్జెన్సీకి తక్షణ కారణం

1971లో రాయ్‌బరేలీ నుంచి లోక్‌సభకు పోటీచేసిన ఇందిరాగాంధీ ఆ ఎన్నికల్లో అవినీతికి పాల్పడ్డారన్న కారణంతో 1975లో అలహాబాద్ హైకోర్టు ఆమెను ప్రధాని పదవికి అనర్హురాలిగా స్పష్టం చేసింది. ఎన్నికల్లో పోటీ చేయకుండా ఆరేండ్లు నిషేధం విధించింది. ప్రధాని పీఠాన్ని విడిచిపెట్టడం ఇష్టంలేని ఇందిర.. అంతకుముందు ఎప్పుడూ ఉపయోగించని 'అత్యాయిక స్థితి'ని విధించారు.

ఎమర్జెన్సీతో ఆర్థికం అతలాకుతలం

ద్రవ్యోల్బణం 29%

ధాన్యం ఉత్పత్తి (-)9.5%

జీడీపీ వృద్ధిరేటు 0.9%

ఎమర్జెన్సీ ఇలా..

- *ప్రారంభం: జూన్ 25, 1975*
- *సమాప్తం: మార్చి 21, 1977*
- *ఎంతకాలం: 635 రోజులు*
- *హరించబడిన ప్రధాన హక్కులు: పౌరుల అన్ని ప్రాథమిక హక్కులు, పత్రికాస్వేచ్ఛ*
- *ఎమర్జెన్సీలో ఆకృత్యాలు: బలవంతపు కుటుంబ నియంత్రణ చికిత్సలు, మురికివాడల్లో ఇండ్ల తొలగింపు, ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుకలను అణిచివేయడం, నాయకుల అక్రమ అరెస్టులు, లాఠీచార్జీలు, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రచారం చేయాలని సర్కారు ఉద్యోగులకు టార్గెట్లు.. లేకపోతే తొలగింపు, వేతనం కోత.*
- *అరెస్టులు: 1,10,806 మంది*
- *మరణాలు: సుమారు వెయ్యి (కుటుంబ నియంత్రణ వ్యతిరేక నిరసనలు, తుర్క్‌మన్ గేట్ వద్ద కాల్పులు, పోలీసుల కస్టడీలో మరణాలు)*
- *ప్రభుత్వతీరును ఎండగట్టిన జడ్జీలకు దక్కింది?- 16 మంది హైకోర్టు న్యాయమూర్తులకు బదిలీలు*

పాపాలు వెంటాడటంతో..

ఎమర్జెన్సీ సమయంలో పౌరులపై జరిగిన ఆకృత్యాలకు తాను కూడా ఒకరకంగా పరోక్షంగా కారణమయ్యానని భావిస్తూ అప్పటి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ కిషన్‌చంద్ 1978లో తన నివాసం వెనుక ఉన్న బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. సూసైడ్ నోట్‌లో 'జిల్లత్ కీ జిందగీ సే మౌత్ బేహ్‌తర్ హై (అవమానకరమైన జీవితం కంటే మరణమే మేలు)' అని రాశారు.

ఎమర్జెన్సీ ఫలితం: *1977లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోరమైన ఓటమిని చవిచూసింది. మొరార్జీ దేశాయ్ నేతృత్వంలోని జనతాపార్టీ విజయం సాధించింది. కేంద్రంలో తొలి కాంగ్రెసేతర ప్రభుత్వం, తొలి కాంగ్రెసేతర ప్రధాని కొలువుదీరారు.*

- స్పెషల్ టాస్క్ బ్యూరో, నమస్తే తెలంగాణ

ప్రధాన చీకటి ఘట్టాలు

వార్తాపత్రికలలో ప్రచురించే ప్రతి అక్షరం ప్రధాన మంత్రి కార్యాలయం ద్వారా బయటకు వచ్చాయి. ఇందుకు నిరసనగా అనేక పత్రికలు సంపాదకీయాల స్థానాన్ని ఖాళీగా ఉంచాయి. ప్రభుత్వాన్ని కాని ఎమర్జెన్సీని కాని విమర్శించిన ప్రచురణ సంస్థలు నిషేధానికి గురయ్యాయి. ఇందిరా గాంధీ చిన్న కుమారుడు సంజయ్ గాంధీ దేశంలో నిర్బంధ కుటుంబ నియంత్రణ చేపట్టారు. ఒక్క 1976 సంవత్సరంలోనే దేశవ్యాప్తంగా లక్షలాది సంఖ్యలో కు.ని. ఆపరేషన్లు జరిగాయంటే ఎంత హడావుడిగా, బలవంతంగా కుటుంబ నియంత్రణ కార్యక్రమం నిర్వహించారో అర్థం చేసుకోవచ్చు. ఢిల్లీలోని తుర్క్‌మాన్ గేట్ ప్రాంతంలో నివసించే పేదలను బలవంతంగా వారి ఇళ్ల నుంచి గెంటేశారు. సుందరీకరణ చర్యలలో భాగంగా వారి ఇళ్లను రాత్రికి రాత్రే కూల్చేశారు. 'అధికారులు మాకు ముందుగా ఎటువంటి హెచ్చరికలు ఇవ్వలేదు. అడ్డుకున్నా నా భర్తను కాల్చడంతో ఆయన కాలి నుంచి తూటా దూసుకుపోయింది. మా ఇంటి ముందే నా భర్త పడిపోగా మా కళ్ల ముందే ఇంటిని కూల్చేశారు' అని 74 ఏళ్ల మెహ్రూనిషా ఆనాటి కాళరాత్రిని తలుచుకుని కన్నీరుమున్నీరయ్యారు. ఆ ప్రాంత ప్రజలు నిరాశ్రయులయ్యారు. వైద్యం లేదు, టాయిలెట్లు లేవు, తినడానికి తిండి లేదు, వండుకోవడానికి వస్తువులు లేకుండా రోడ్డునపడ్డారు.

న్యాయ సంక్షోభం

జాతీయ ఎమర్జెన్సీ కాలంలో ప్రజలకు హెబియస్ కార్పస్ హక్కుతోసహా తమ ప్రాథమిక హక్కుల అమలు కోసం ఏ న్యాయస్థానాన్ని ఆశ్రయించే హక్కు లేదని భారత అత్యున్నత న్యాయస్థానం 4:1 మెజారిటీతో సంచలన తీర్పును వెలువరించింది. (ఏడీఎం జబల్‌పూర్, శివకాంత్ శుక్లా కేసు(1976).

42వ రాజ్యాంగ సవరణ

ఇందిరా గాంధీ ప్రభుత్వం 42వ రాజ్యాంగ సవరణను ప్రవేశపెట్టి చట్టాలలో పెనుమార్పులు తీసుకువచ్చింది. ఆ మార్పులు ఎంత విస్తారంగా ఉన్నాయంటే వాటిని మినీ రాజ్యాంగంగా అభివర్ణించడం జరిగింది. రాజ్యాంగానికి గుండెలాంటి పీఠికను ఇందిరా గాంధీ ప్రభుత్వం మార్చివేసింది. సోషలిస్టు, సెక్యులర్, ఇంటగ్రిటి పదాలను పీఠికలో చేర్చింది. స్వరణ్ సింగ్ కమిటీ ఇచ్చిన సిఫార్సుల ఆధారంగా 1976లో రాజ్యాంగానికి 10 ప్రాథమిక విధులను ప్రభుత్వం జతచేసింది. ఎమర్జెన్సీలో ఈ విధులు ప్రాథమిక హక్కులను మించి అమలు జరిగాయి. రాజ్యాంగంలో తీసుకువచ్చిన పలు సవరణలు న్యాయవ్యవస్థ అధికారాలను కట్టడి చేశాయి. రాజ్యాంగ నిర్మాతలు ఎంతో దార్శనికతతో పార్లమెంట్, న్యాయ వ్యవస్థ మధ్య పరస్పర నియంత్రణ, సమతుల్యత ఉండాలన్న ఆకాంక్షకు తూట్లు పొడుస్తూ పార్లమెంటే అత్యున్నత రాజ్యాంగ వ్యవస్థగా మార్చడానికి ఇందిర ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

ఎమర్జెన్సీ ప్రకటించాక ఇందిరను చుట్టుముట్టిన పాత్రికేయులు

ఎమర్జెన్సీకి 5 ముఖ్య కారణాలు

1, గుజరాత్‌లో అలజడి

1973లో ఫీజుల పెంపు గుజరాత్ వ్యాప్తంగా విద్యార్థుల నిరసనలకు దారి తీసింది. ముఖ్యమంత్రి చిమన్‌భాయ్ పటేల్‌పై "చిమన్ చోర్"అనే ముద్ర పడింది. దీంతో 1974 ఫిబ్రవరిలో గుజరాత్ ప్రభుత్వాన్ని రద్దు చేసిన ఇందిరా గాంధీ రాష్ట్రపతి పాలన విధించారు.

2. బీహార్‌లో జేపీ ఉద్యమం

బీహార్ సీఎం అబ్దుల్ గఫూర్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న విద్యార్థి ఉద్యమంలో గాంధేయవాది జయప్రకాశ్ నారాయణ్(జేపీ) చేరారు. ఈ ఉద్యమం లాలూ ప్రసాద్ యాదవ్, నితీష్ కుమార్ వంటి భావి నాయకులను సృష్టించింది. సంపూర్ణ క్రాంతి(సంపూర్ణ విప్లవం), ఇందిరా గాంధీ తొలగింపునకు జేపీ పిలుపునిచ్చారు.

3. ఫెర్నాండేజ్ సారథ్యంలో రైల్వే సమ్మె

కార్మిక నాయకుడు జార్జి ఫెర్నాండేజ్ సారథ్యంలో 1974లో బ్రహ్మాండమైన రైల్వే సమ్మె జరిగింది. దేశవ్యాప్తంగా ఎక్కడి రైళ్లు అక్కడే ఆగిపోయాయి. అదే సమయంలో ఆనాటి రైల్వే మంత్రి, బీహార్ ఎంపీ ఎల్ఎన్ మిశ్రా బాంబు దాడిలో మరణించడంతో తీవ్ర స్థాయిలో ఉద్రిక్తతలు చెలరేగాయి.

4. ఇందిరపై కేసు

ఎన్నికల అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ సోషలిస్టు నాయకుడు రాజ్ నారాయణ్ 1971లో ఇందిరా గాంధీ గెలుపును అలహాబాద్ హైకోర్టులో సవాలు చేశారు. 1975 జూన్ 12న ఇందిరని దోషిగా తేల్చిన జస్టిస్ జగ్‌మోహన్‌లాల్ సిన్హా ఆమె ఎన్నిక చెల్లదని తీర్పు ఇచ్చారు. అదే సమయంలో గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి పాలైంది. జూన్ 24న ఇందిర ఎన్నికపై అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై షరతులతో కూడిన స్టే మంజూరు చేసిన సుప్రీంకోర్టు ఓటింగ్ హక్కులు లేకుండా ఆమె ప్రధానిగా కొనసాగడానికి అనుమతి ఇచ్చింది.

ఎమర్జెన్సీ ప్రకటన

1975 జూన్ 25న జేపీ నారాయణ్, మొరార్జీ దేశాయ్, ఇతర నాయకులు ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో ర్యాలీ నిర్వహించి రాజ్యాంగ వ్యతిరేక ఉత్తర్వులను ధిక్కరించాలని పోలీసులు, సైన్యానికి పిలుపునిచ్చారు. అదే రోజు రాత్రి తన కుమారుడు సంజయ్ గాంధీతో కలిసి దేశంలో ఎమర్జెన్సీ విధించాలని ఇందిరా గాంధీ నిర్ణయించారు. మరుసటి రోజు సూర్యోదయం నుంచి 21 నెలలు అమలులోఉంది